సాక్షి
పెద్దపల్లి

ఆదివారం । 28 । జనవరి । 2024



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జ్యోతినగర్: ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి సభ్యులు పిక్నిక్, స్పోర్ట్స్‌డే సందర్భంగా కరీంనగర్‌లోని జింకల పార్క్ సందర్శించారు.



వీల్ లోడర్ ప్రారంభం

గోదావరిఖని: రూ.4.50కోట్లతో కొనుగోలు చేసిన హైడ్రాలిక్ వీల్ లోడర్‌ను ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రారంభించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/14.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల వినియోగం వద్దు



మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్ అంధకారంలో పడుతుందని అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఐబీకాలనీలో మాదక ద్రవ్యాల వినియోగంతో తలెత్తే దుష్పరిణామాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో జడ్జి మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో వ్యాధి నిరోధక శక్తి క్షీణించడంతోపాటు జీర్ణవ్యవస్థ, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె లాంటి విలువైన అవయవాలు దెబ్బ తింటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సోషల్ వలంటీర్ ఎ.శంకర్, ప్రధానోపాధ్యాయురాలు సాయిలీల, న్యాయవాది బల్మూరి అమరేందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెయిన్స్ ప్రశాంతం



హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

రామగిరి(మంథని): స్థానిక జేఎన్టీయూలో శనివారం జేఈఈ(మెయిన్స్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 95 మంది విద్యార్థులకు ఉదయం ఇద్దరు, మధ్యాహ్నం ముగ్గురు పరీక్షకు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం సెషన్‌లో నిర్ణీత సమయం తర్వాత ఓ విద్యార్థి పరీక్ష కేంద్రానికి రావడంతో పరీక్షకు అనుమతించలేదని ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న మహేశ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక శనివారం నిర్వహించిన సైన్స్ నాలెడ్జ్ ప్రతిభ పోటీల్లో తారుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంబాడి మోహన్, దోబిల అక్షిత్ ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు నోడల్ అధికారి మహేశ్ తెలిపారు. ద్వితీయ స్థానంలో వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.రాంచరణ్, ఎస్.రాంచరణ్, కె.ప్రశాంత్, తృతీయ స్థానంలో పెగడపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన భరత్, రష్మిక, అజయ్‌కుమార్ నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. హెచ్ఎంలు సునీత, శ్యాంసుందర్‌రెడ్డి, కె.శ్రీనివాస్, సత్యనారాయణరావు, ఉపాధ్యాయులు చంద్రమోహన్, సత్యప్రకాశ్, రవి, కృష్ణమూర్తి, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగిపురుగును నివారించాలి



పంట పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: పంటలను ఆశించిన మొగిపురుగు రైతులు నివారించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి సూచించారు. దుబ్బపల్లి గ్రామంలోని వివిధ పంటలను శనివారం ఆయన పరిశీలించారు. మొగిపురుగు నివారణ కోసం కార్బోస్ హైడ్రోక్లోరైడ్ 2గ్రాములను లీటరు నీటిలో కలపాలని, క్లోరాంత నిలిపోల్ 0.4ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. ఏఈవో సౌమ్య, సర్పంచ్ శ్రావణ్, రైతులు బుచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి అభివృద్ధి సమీక్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం ఆదివారం జరగనుంది. కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ సమీక్షకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు హాజరవుతారని అధికారవర్గాలు శనివారం తెలిపాయి.

సా..గుతున్న పనులు

- వేగం పుంజుకోని రైల్వే వంతెన నిర్మాణం
- గుంతలమయమైన అప్రోచ్‌రోడ్డు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు



పెద్దపల్లి - కూనారం మధ్య సాగుతున్న రైల్వే వంతెన పనులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–కూనారం మధ్య ప్రధాన రైల్వే లెవల్‌క్రాసింగ్ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ వంతెన నిర్మాణం సా.. గుతోంది. పెద్దపల్లి నుంచి కూనారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల మీదుగా జమ్మికుంట, హుజూరాబాద్– వరంగల్, మంథని ప్రాంతాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపర్చేందుకు ఈ మార్గంలోని 39వ నంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈప్రాంత వాసుల డిమాండ్ మేరకు రూ.119.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. 2022 అక్టోబర్ 10న అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వంతెన నిర్మాణం ప్రారంభించారు. దీంతో ఇక గంటల తరబడి రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద నిరీక్షించాల్సిన అవసరం ఉండదని వాహనదారులు, పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ, ఏడాది గడిచినా పనుల్లో వేగం పుంజుకోవడంలేదు.

నత్తనడకన నిర్మాణం..

దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా రైల్వే వంతెన పనుల్లో వేగం పుంజుకోవడంలేదు. సగం దూరం వరకు దిమ్మెలు నిర్మించారు. ఇందులో కొంతదూరమే పైకప్పు పనులు పూర్తయ్యాయి. పనుల్లో వేగం పెంచితేనే వంతెన అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పనుల్లో వేగం పెంచేలా చూడాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు.

అప్రోచ్ రోడ్డులో అవస్థలు..

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరిగే ప్రాంతంలో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా మట్టితో నిర్మించిన అప్రోచ్‌రోడ్డు ఇప్పుడు గుంతలమయంగా మారింది. ఈమార్గంలో ప్రయాణించే వారంతా నానా ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు గమనించక ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పెద్దపల్లి నుంచి ప్రధాన రైలు మార్గం ఉండడంతో ప్రతీ అర్ధగంటకో ఎక్స్‌ప్రెస్ రైలు, పదుల సంఖ్యలో గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. దీంతో తరచూ గేటు పడుతోంది. ఇక్కడ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

వంతెన సమాచారం

మార్గం	పెద్దపల్లి – కూనారం రోడ్డు మధ్య
లెవల్ క్రాసింగ్	39వ నంబరు గేటు
మంజూరైన నిధులు(రూ.కోట్లలో)	119.50
మంజూరుచేసింది	రైల్వే సేఫ్టీ వర్క్స్
పనులు ప్రారంభం	10 అక్టోబరు 2022

వేగం పెంచాలి



రైల్వే వంతెన నిర్మాణంలో వేగం పెంచాలి. నత్తనడక సాగుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలి.
–కుమార్, సింగిల్ విండో డైరెక్టర్, హనుమంతునిపేట

శ్రద్ధ చూపాలి



పెద్దపల్లి–కూనారం మార్గంలో చేపట్టిన రైల్వే వంతెన పనుల్లో వేగం పెంచేలా అధికారులు శ్రద్ధ చూపాలి. ఈప్రాంత ప్రజల ఇబ్బందులను తీర్చేందుకే కేంద్రప్రభుత్వం వంతెన నిర్మిస్తోంది.
–మేకల శ్రీనివాస్, బీజేపీ నేత

అందుబాటులోకి తేవాలి



రైల్వే వంతెన పనులు పూర్తయి వినియోగంలోకి వస్తేనే ఈ ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. ఏడాదిన్నర కావొస్తున్నా పనులు అంతంత మాత్రమే జరగడం అధికారుల పనితీరును తెలియజేస్తోంది.
–బి.రమేశ్‌గౌడ్, పెద్దపల్లి

సింగరేణి, ఎన్టీపీసీలదే బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

- వారే సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించాలి
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- అన్ని శాఖల అధికారులతో సన్నాహక సమావేశం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నియోజకవర్గంలో చేపట్టే సమ్మక్క – సారలమ్మ జాతర నిర్వహణ బాధ్యత సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలదేనని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే గోదావరిఖని సమ్మక్క– సారలమ్మ జాతర నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు, జాతర కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తదితర సంస్థల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతరకు పది రోజుల ముందే ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. జాతర తర్వాత ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. సోమవారం జాతర ప్రాంతాన్ని సందర్శిస్తామన్నారు.

సామాజిక బాధ్యతగా తీసుకోవాలి..

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సింగరేణి, ఎన్టీపీసీ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.
- గోలివాడ జాతరలో ఎన్టీపీసీ, గోదావరిఖని జాతరలో సింగరేణి యాజమాన్యం ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు.
- రామగుండం నగరపాలక సంస్థతోపాటు అన్ని ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు సహకారం అందిస్తాయని ఆయన తెలిపారు.
- బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడకుండా గోదావరిఖని పుష్కర ఘాట్ వద్ద 1992న సమ్మక్క సారలమ్మ జాతరను సింగరేణి యాజమాన్యం ప్రారంభించిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

అసౌకర్యం కలుగకుండా చూడండి..

భక్తులకు ఈసారి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, లైటింగ్, మంచినీళ్లు, పారిశుధ్యం నిర్వహణ తదితర సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అన్నారు. జాతర మైదానంలోకి వీఐపీలు సహా ఎవరి వాహనాల ప్రవేశం కల్పించరాదని ఆయన సూచించారు. అన్ని ప్రవేశ ద్వారాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు.

సిరీస్ బల్బులతో అలంకరించండి..

- జాతర ప్రాంతాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్లు, సిరీస్ బల్బులతో అత్యంత సుందరంగా అలంకరించాలని ఎమ్మెల్యే సూచించారు.
- పోలీస్ కంట్రోల్ రూమ్, వైద్య శిబిరం, మీడియా సెంటర్, అత్యవసర సేవలందించడానికి అన్ని విభాగాల సిబ్బందితో వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు.
- గోదావరి నదిలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రెస్క్యూ టీమ్‌ను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.
- కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, ఆర్డీవో మధుమోహన్, తహసీల్దార్ కుమారస్వామి, సింగరేణి ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, కార్పొరేటర్లు కల్వచర్ల కష్ణవేణి, ధాతు శ్రీనివాస్, జనగామ కవిత సరోజిని, పెద్దెల్లి తేజస్విని, కన్నూరి సతీశ్‌కుమార్, కొలిపాక సుజాత, మహంకాళి స్వామి, దొంత శ్రీనివాస్, బొంతల రాజేశ్, గాదం విజయ, బాలరాజ్ కుమార్, ధరణి స్వరూప, ముస్తఫా, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారి యుగంధర్‌రావు, దేవాదాయ శాఖ ఈడీ సుజాతరెడ్డి, ఆర్ఎఫ్‌సీఎల్ హెచ్‌ఆర్ మేనేజర్ వంశీకృష్ణ ఉన్నారు.

అధికారుల సంఘం ఎన్నికలకు అన్నిఏర్పాట్లు



ప్రచారం చేస్తున్న అధికారులు



కొత్తగూడెం ప్రధాన కార్యాలయం

- 30 ఏళ్ల తర్వాత ప్రత్యక్ష ఎన్నికలు

గోదావరిఖని: సింగరేణిలోని అధికారుల సంఘం ఎన్నికల ప్రచారానికి తెరపడింది. 18రోజులపాటు అధికారులు ఎన్నికల ప్రచారంలో మునిగి తేలారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న 12 ఏరియాల అధ్యక్షులు, ఓవరాల్ సింగరేణి కమిటీ కోసం ఆదివారం పోలింగ్ నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య ఎన్నికల ముఖ్య అధికారిగా వ్యవహరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే ఎన్నికల సామగ్రి తరలించారు. ఆయా ఏరియాల జీఎంల నేతృత్వంలో పోలింగ్ జరుగుతుంది. ఆదివారం పోలింగ్ నిర్వహిస్తారు. అదేవిధంగా 28, 29వ తేదీల్లో ఓట్ల లెక్కింపు చేపడతారు. విజేతలకు ఈనెల 30న ధ్రువీకరణ పత్రం అందిస్తారు.

సింగరేణిస్థాయి అధ్యక్ష స్థానానికి ఆరుగురు పోటీ

- సింగరేణి స్థాయి ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం ఆరుగురు పోటీ పడుతున్నారు.
- ఓసీపీ–1 ఏజెంట్ ఎన్.రాధాకృష్ణ, కొత్తగూడెం కిష్టారం గని ఇంజనీర్ గడిపెల్లి కృష్ణప్రసాద్, శ్రీరాంపూర్ డీవైజీఎం గోపాల్‌సింగ్, శ్రీరాంపూర్ డీవైజీఎం అనుముల వెంకటేశ్వర్‌రెడ్డి, మణుగూరు పీకే ఓసీపీ డీవైజీఎం టి.లక్ష్మీపతిగౌడ్, కొత్తగూడెం పీవీకే గని డీవైజీఎం పాలడుగు శ్రీనివాస్ అధ్యక్ష బరిలో ఉన్నారు.
- వీరిలో కృష్ణప్రసాద్ సింగరేణి సంఘం అధ్యక్షుడిగా ఇప్పటికే పనిచేశారు.
- ప్రధాన కార్యదర్శి స్థానం కోసం ఎన్వీ రాజశేఖర్‌రావు, పి.సత్తిరెడ్డి, వి.రామకృష్ణ, పెద్ది నర్సింహులు పోటీ పడుతున్నారు.
- రెండు పోస్టులు ఉన్న ఉపాధ్యక్ష స్థానం కోసం 9మంది, రెండు పోస్టులు ఉన్న సంయుక్త కార్యదర్శుల పదవుల కోసం 14మంది, కోశాధికారి కోసం ఇద్దరు, సంయుక్త కోశాధికారి కోసం ముగ్గురు పోటీ పడుతున్నారు.

మూడు ఏరియాల్లో ఏకగ్రీవం..

సింగరేణిలోని 12 ఏరియాల్లో ఆర్జీ–1, 2, బెల్లంపల్లి ఏరియాల్లో అధ్యక్ష స్థానం కోసం ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో ఆ పోస్టులు ఏకగ్రీవమయ్యాయి. గడిచిన 30ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి రహస్య బ్యాలెట్ పద్ధతిన సింగరేణి బొగ్గు గనుల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

అధికారుల(ఓటర్ల) వివరాలు)

ఏరియా	పోలింగ్ కేంద్రం	ఓట్లు
కార్పొరేట్	పోస్టల్ బ్యాలెట్	12
కార్పొరేట్	కేసీవోఏ క్లబ్	384
కార్పొరేట్	సింగరేణి భవన్	47
కార్పొరేట్	వర్కింగ్ హాస్టల్ సైనీ	18
కొత్తగూడెం	ఆర్‌సీవోఏ క్లబ్	93
కొత్తగూడెం	ఆఫీసర్స్ క్లబ్	75
ఇల్లెందు	జీఎం ఆఫీస్	74
మణుగూరు	పోస్టల్ బ్యాలెట్	01
మణుగూరు	ఇల్లెందు క్లబ్	161
ఆర్జీ–1	ఇల్లెందు క్లబ్	229
ఆర్జీ–2	ఎన్‌సీవోఏ క్లబ్	163
ఆర్జీ–3	సీఎస్‌సీ క్లబ్	221
భూపాలపల్లి	ఇల్లెందు క్లబ్	151
బెల్లంపల్లి	గోలేటి ఆఫీసర్స్ క్లబ్	74
మందమర్రి	ఇల్లెందు క్లబ్	179
శ్రీరాంపూర్	ఎస్‌సీవోఏ క్లబ్	217
ఎన్టీపీసీ	ఆఫీసర్స్ క్లబ్	75

ఏర్పాట్లు పూర్తిచేశాం



సింగరేణిలో అధికారుల ఎన్నికల కోసం ఏర్పాట్లు పూర్తిచేశాం. బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రి అన్నిఏరియాలకు తరలించాం. సింగరేణి స్థాయి ఎన్నికల కోసం తెల్ల, ఏరియా ఎన్నికల కోసం పసుపురంగు బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తున్నాం. మొత్తం 17పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నాం. – గురువయ్య, ముఖ్య ఎన్నికల అధికారి

ప్రజాసేవకే అంకితం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రభుత్వ విప్‌తో సర్పంచులు

ధర్మారం(ధర్మపురి): గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా సేవ చేస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసిపోతున్న సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ఆధ్వర్యంలో సర్పంచులను ఘనంగా సన్మానం చేశారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, కరోనా కష్టకాలంలో సర్పంచులు ప్రజలకు చేసిన సేవలు అద్భుతమన్నారు. ప్రజలతో మమేకమై సేవలు అందిస్తేనే గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సర్పంచులు చేసిన, భవిష్యత్‌లో చేపట్టే పనులకు తాను పార్టీలకతీతంగా సహకరిస్తానని అభయం ఇచ్చారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ మాట్లాడుతూ తన హయాంలో సర్పంచులు చేసిన అభివృద్ధితోనే మండలానికి జాతీయస్థాయిలో అవార్డు లభించిందన్నారు. సర్పంచులు అందించిన సహకారాన్ని జీవితంలో మరువలేనని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, ఎంపీడీవో భీమ జయశీల, తహసీల్దార్ అంబటి రజిత, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ గ్రామాలను గుర్తించండి

- పారిశ్రామిక ప్రాంతంలో సర్వే చేయండి
- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: క్షయ నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులపై విస్తృతంగా ప్రచారం చేయాలని, క్షయ(టీబీ) కేసులు నమోదైన గ్రామాలను గుర్తించి టీబీ ముక్త్ ప్రాంతాలుగా ప్రకటించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో క్షయ ఫోరం, చైల్డ్ డెత్‌పై సమీక్ష నిర్వహించారు. బొగ్గు గనులు, పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం ఏరియాలో టీబీ వ్యాప్తిపై సర్వే నిర్వహించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి సమయాల్లో చెమటలు పట్టడం లాంటి సమస్యలు ఉన్న వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని, ఈ విషయమై కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అవసరమని భావిస్తే ఆస్పత్రికి పంపించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో చంద్రమౌళితోపాటు శౌరయ్య, కృపాబాయి, సుధాకర్‌రెడ్డి, రవీందర్, రాజ్‌గోపాల్, ప్రణీత్, సునీత, శ్రీదేవి, మూర్తి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సైన్స్ ఒక భాగం



మాట్లాడుతున్న డీఈవో మాధవి

జ్యోతినగర్(రామగుండం): సమాజంలో సైన్స్ ఒక భాగమని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి అన్నారు. ఎన్టీపీసీలోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జిల్లాస్థాయి బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. టెక్ మహీంద్రా ఫౌండేషన్ సైన్స్ ఎడ్యుకేషన్ విభాగం సౌజన్యంతో చేపట్టిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం తమ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. టెక్ మహీంద్రా బయోలజీ సైన్స్ విభాగం హెచ్‌వోడీ రేవతి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జయరాజు, మల్లేశ్, అమీర్ అలి, సత్యనారాయణ, కృష్ణమోహన్‌మూర్తి, తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గూళ్ల అంజన్ కుమార్, ప్రధానకార్యదర్శి మూల నరేశ్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వొద్దు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ కార్యాలయాల్లో అడుగుతున్నారా? అయితే లంచం ఇవ్వకండి.. 1064 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వండి.. అని అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) అధికారులు ముద్రించిన పోస్టర్లు కలెక్టరేట్‌లో దర్శనమిస్తున్నాయి. ఏసీబీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం సెల్ నంబర్లు 91543 88989, 94404 46106, 040–23251555తోపాటు కరీంనగర్ రేంజ్ కార్యాలయ సెల్ నంబరు 91543 88954, 0878 2243693కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

25మంది సీఐల బదిలీ



గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని 25మంది సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్–2 ఐజీ శనివారం ఆదేశాలు జారీచేశారు. రాబోయే ఎంపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఒకేచోట ఎక్కువకాలం పనిచేయడంతోపాటు పరిపాలన సౌలభ్యం కోసం బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్డీ అఫ్జలుద్దీన్	జీడీకే–2టౌన్	బెల్లంపల్లి రూరల్
ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్	బెల్లంపల్లిరూరల్	టాస్క్‌ఫోర్స్–1
కె.రాంచందర్‌రావు	అటాచ్ మల్టీజోన్	సీసీఎస్–3
ఎన్.దేవయ్య	సీసీఎస్–3	బెల్లంపల్లి–1
ఆర్.బన్సీలాల్	బెల్లంపల్లి–1	శ్రీరాంపూర్
జి.రమేశ్‌బాబు	శ్రీరాంపూర్	సీఎస్‌బీ–4
డి.రాజనర్సయ్య	సీఎస్‌బీ–4	ఐజీ, మల్టీజోన్–1
డి.సుధాకర్	టాస్క్‌ఫోర్స్–2	చెన్నూర్‌రూరల్
సీహెచ్ విద్యాసాగర్	చెన్నూర్‌రూరల్	ఐజీ, మల్టీజోన్–1
కె.రవీందర్	సీసీఎస్, రాజన్న	చెన్నూర్‌టౌన్
ఎస్.వాసుదేవరావు	చెన్నూర్‌టౌన్	ఐజీ, మల్టీజోన్–1
బి.రవి	పీసీఆర్, ఆదిలాబాద్	మందమర్రి
జి.మహేందర్‌రెడ్డి	మందమర్రి	ఐజీ, మల్టీజోన్–1
ఆర్.కృష్ణ	లక్సెట్టిపేట	పెద్దపల్లి
బి.అనిల్	పెద్దపల్లి	ఐజీ, మల్టీజోన్–1
ఆకుల అశోక్	సీసీఆర్‌బీ	మంచిర్యాల్‌రూరల్
టి.సంజీవ్	మంచిర్యాల్‌రూరల్	ఐజీ, మల్టీజోన్–1
ఎన్.ప్రసాదరావు	జీడీకే–1టౌన్	గోదావరిఖని–2టౌన్
సూరం వేణుగోపాల్	జీడీకే–2టౌన్	ఐజీ, మల్టీజోన్–1
టి.ప్రవీణ్‌కుమార్	ట్రాఫిక్	రామగుండం
వై.చంద్రశేఖర్‌గౌడ్	రామగుండం	ఐజీ, మల్టీజోన్–1
కె.ప్రేమ్‌కుమార్	నార్నూర్	సీఎస్‌బీ–2
జి.మొగిలి	సీఎస్‌బీ–2	సీసీఆర్‌బీ, కరీంనగర్
ఎం.రాజు	మంచిర్యాల్‌టౌన్	ఐజీ, మల్టీజోన్–1
పి.రాజేంద్రప్రసాద్	సైబర్‌క్రైం–2	ఐజీ, మల్టీజోన్–1

క్లుప్తంగా

లక్ష్య సాధనలో అగ్రగామిగా నిలవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. శనివారం ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గుర వాణాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తిపై ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. గనుల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏరియా ఇంజినీరు రాంమూర్తి, ఏజీఎం (పర్సనల్) లక్ష్మీనారాయణ, ఏజెంట్ బి.సైదులు, అధికారులు చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, మదన్‌మోహన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన



గనిలో దిగేందుకు వెళ్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–2ఏగనిలోని ప్రమాద స్థలాన్ని గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ నాయకులు శనివారం పరిశీలించారు. గనిలోకి దిగి ప్రమాదం జరిగి సమ్మిరెడ్డి గాయపడిన ప్రాంతాన్ని తనిఖీ చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని సూచించారు. గనిలోకి దిగిన వారిలో నాయకులు ఎల్.ప్రకాశ్, మడ్డి ఎల్లాగౌడ్, వీరభద్రం, ఆరెల్లి పోశం, మాదన మహేశ్, నాగేందర్ తదితరులు ఉన్నారు.

‘ఖని’లో సైకో వీరంగం



నిందితుడు

గోదావరిఖని: స్థానిక ఎల్బీనగర్ సెంటర్లో శనివారం రాత్రి ఓ సైకో వీరంగం సృష్టించాడు. స్థానికంగా పలువురుపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. స్థానికులు చాకచక్యంగా పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సైకోను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి మానసికస్థితి సరిగా లేనట్లుగా తెలుస్తోంది.

ఆవేదన దించుకోవాలె.. జనంతో పంచుకోవాలె!


- ‘పెద్దింటి’ కథలు.. వలస కన్నీళ్లు
- పల్లె ఆత్మ కథల్లో ఆవిష్కరణ
- కదిలించిన కరువు, కూలిపోతున్న కులవృత్తులు
- కథకుడు, మాటలు, పాటల రచయిత అశోక్‌కుమార్ సాహిత్య ప్రస్థానం



అశోక్‌కుమార్

సాక్షి, కరీంనగర్ డెస్క్: ఆయన కథలు చదువుతుంటే మట్టి వాసన పరిమళిస్తుంది.. పల్లెల ముఖచిత్రం కళ్లముందు మెదులుతుంది.. మనసును కథలోకి లాక్కెళ్తాడు.. గుండెను పిండేసి కన్నీరు పెట్టిస్తాడు.. మానవ విలువలను రంగరించి రుచిచూపిస్తాడు. నవలంటే జీవితం.. ఓ తరం చరిత్ర, వికాసం, అభివృద్ధి. అలాంటి నవలా ప్రపంచంలో కొత్త చరిత్రను రాసినవాడు పెద్దింటి అశోక్‌కుమార్. రాజన్న సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేట స్వస్థలం. ఐదు దశాబ్దాల తెలంగాణ చరిత్రను తన ఐదు నవలల్లో ఆవిష్కరించారు. భాషాసంస్కృతుల మీద దృష్టిపెట్టి, పల్లె జీవితాన్ని, ఆచార వ్యవహారాలను చిత్రించారు. ఆయన రాసిన ‘జిగిరి’ నవల 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అశోక్‌కుమార్ 250 వరకు కథలు, 9 నవలలు, 8 కథాసంపుటిలు, 6 నాటికలు, 100 వరకు సామాజిక వ్యాసాలు రాశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, పాఠ్యాంశాల రూపశిల్పిగా, కథకుడిగా, మాటలు, పాటల రచయితగా ప్రసిద్ధి చెందారు. పెద్దింటి అశోక్‌కుమార్ సాహిత్యానికి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా పలకరించగా చెప్పిన పలు విషయాలు ఆయన మాటల్లోనే..

- నేను 1968 ఫిబ్రవరి 6న గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలో పుట్టాను. అమ్మానాన్న మల్లవ్వ, అంజయ్య. మాది రెండెకరాల పేద కుటుంబం. నా ప్రాథమిక విద్య మా ఊరిలోనే సాగింది. ఉన్నత విద్య మా పక్క ఊరు లింగన్నపేటలో చదివాను. ఇంటర్ గంభీరావుపేటలో చేశాను. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ(గణితం), ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఈడీ పూర్తి చేసి, 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మా పక్క ఊరు కోరుట్లపేటలో జాయిన్ అయ్యాను. మా ఊరి నుంచే బడికి వెళ్లేవాడిని.
- అప్పట్లో కరువు పరిస్థితులు, వలసలు, ప్రపంచీకరణ, కూలిపోతున్న కులవత్తులు నన్ను కదిలించాయి. నా చిన్నప్పుడే మా నాన్న బతుకు దెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అప్పట్లో ఉత్తరం వచ్చేందుకు నెలలు పట్టేది. మా సమీప బంధువులు చాలా మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అలా నేను ఒక రకంగా వలస కుటుంబాలు కష్టాలను, కన్నీళ్లను దగ్గరి నుంచి చూశాను. అవే కథావస్తువులు అయ్యాయి.



పుస్తకాల ముఖచిత్రాలు

- 1999లో రచనా రంగంలోకి వచ్చాను. ‘ఆశ.. నిరాశ.. ఆశ’ నా తొలిరచన. అది అప్పట్లో ఓ ప్రముఖ దినపత్రికలో ప్రచురితమైంది. తెలంగాణ యాసను, భాషను, సామెతలను ఆవిష్కరిస్తూ.. అనేక కథలు రాశాను. తెలంగాణ అంటేనే వలసలకు నిర్వచనం. అవి ఉత్తర తెలంగాణలో మరీ ఎక్కువ. ఆ వలస వెనుక విషాదం దాగి ఉంటుంది. కన్నీళ్లు పొంగుతాయి. వలసలోని వికత రూపాలను 2001లో ‘ఎడారి మంటలు’గా చిత్రించాను. దేశం కాని దేశంలో భాష రాని రాజ్యంలో తెలంగాణ బిడ్డలు పడుతున్న బాధలు.. కొడుకులు దూర దేశంలో ఉంటే ఇక్కడ తల్లులు పడుతున్న తండ్లాట రాశాను.
- గ్రామీణ పర్యావరణాన్ని అంశంగా తీసుకొని ‘దాడి’ నవల రాశాను. వ్యవసాయం ఏతం, మోట, రాటు, డీజిల్ ఇంజిన్లను దాటుకొని హైస్పీడ్ మోటార్లు, సబ్‌మెర్సిబుల్ పంపులదాకా వచ్చింది. ఫలితంగా దోసెడు మట్టిని తీస్తే దోసెడు నీళ్లూరే భూములు నీళ్లు లేక ఎండిపోయాయి. అడవులు నాశనమైపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ తరాలకు నీరు ఎలా అందుతుందన్న ప్రశ్నను ముందుంచుతూ ‘దాడి’ని రాశాను.
- జంతులక్షణాలు ఉన్న మనిషికి.. మనిషి లక్షణాలు ఉన్న జంతువుకు మధ్య సంఘర్షణే ‘జిగిరి’ నవల. ఆకాశవాణిలో ప్రసారమైంది. ఇలా ఇప్పటివరకు నవలలుగా ఎడారి మంటలు (2002), దాడి (2005), జిగిరి (2006), ఊరికి ఉప్పులం (2007), సంచారిని (2011), మిలియన్ మార్చ్ (2017), ఇంకెంత దూరం (2020) రాశాను. కథా సంపుటాలుగా ఊటబాయి (2003), వలస బతుకులు (2004), మా ఊరి బాగోతం (2005), మాయిముంత (2007), భూమడు (2009), పోరుగడ్డ (2011), జుమ్మేకి రాత్‌మే (2015), గుండెలో వాన (2021) ప్రచురితమయ్యాయి. ఎండమావి (2005), పోరుగడ్డ (2016), తెగారం (2018), నెనరు (2021) నాటకాలుగా ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. తెగారం నాటకానికి నటనలో నంది అవార్డు సహా పాతిక అవార్డులు వచ్చాయి. నేను రాసిన మరో 25 కథలు హిందీలోకి అనువాదం అయ్యాయి.



రామాజిపేట స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా అశోక్‌కుమార్ ఊరి జనం ముందు రెఫరెండం (ఫైల్)

- కథా రచయితగా ఉన్న నేను తొలిసారి 2010లో వేదం సినిమాకు మాటలు రాశాను. ఆ సినిమా నిర్మాత క్రిష్ నన్ను పిలిచి, తెలంగాణ మాండలికం పోర్షన్‌కు మాటలు రాయించారు. ఆ సినిమాలోని ఓ పాత్రకు నేను ‘సిరిసిల్ల రాజయ్య’అనే పేరు పెట్టాను. అలా ‘దాగుడు మూతలు దండాకోర్’, ‘మల్లేశం’, ‘దొరసాని’, ‘తమసోమ జ్యోతిర్గమయ’, ‘షరతులు వర్తిస్తాయి’ వంటి సినిమాలకు పని చేశాను. పలు సినిమాల్లో పాటలు రాశాను. నటించాను కూడా. నేను రాసిన జిగిరి నవల సినిమాగా రాబోతుంది. ఇప్పటికే నా ‘ఊటబాయి’ కథను అదేపేరుతో పాలసాని వేణు చిన్న సినిమాగా తీశారు. టీవీ సీరియల్‌గా కూడా కొన్ని కథలు బుల్లితెరకెక్కాయి. ఇంకా కొన్ని సినిమాలకు కమిట్‌మెంట్ కుదిరింది.
- నేను రాసిన 8 కథలు వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలయ్యాయి. కాకతీయ వర్సిటీ ఎంఏ తెలుగు విభాగం విద్యార్థులకు ‘మాయిముంత’, ‘ఇగురం’ కథలు పాఠ్యాంశాలుగా మారాయి. ఉస్మానియా వర్సిటీ ‘జిగిరి’, నవలను, ‘గోస’ కథను ‘లాంగ్ మార్చ్’ నవలను పాఠ్యాంశంగా చేర్చారు. దక్షిణ భారతీయ భాషా అధ్యయన కేంద్రం మైసూర్ వారు తెలుగు విద్యార్థులకు ‘అనగనగా ఓ కోడి పెట్ట’ కథను పాఠ్యాంశం చేశారు. నాగార్జున వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులకు రైతు జీవితం నేపథ్యంలో రాసిన ‘గుండెలోన వాన’ కథను బోధిస్తున్నారు. ఓరియంటల్ కాలేజీ పీడీసీలో జిగిరి నవల పాఠ్యాంశమైంది. నా సాహిత్యంపై ఆరుగురు పరిశోధనలు, ఆరుగురు ఎంఫిల్ చేశారు. విచిత్రంగా నేను తెలుగుపై పీహెచ్‌డీ చేస్తుండగా.. నా జిగిరి నవల గురించి నాకే ప్రశ్న వచ్చింది. తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం కేసీఆర్ నా సాహిత్య శైలిని ప్రస్తావించడం సంతోషమనిపించింది.
- నేను గవర్నమెంట్ టీచర్‌గా పని చేస్తూ.. బండలింగంపల్లిలో ‘గుండ్ల చెరువు’ పేరుతో స్కూల్ మ్యాగజైన్‌ను నడిపించాను. రామాజిపేటలో మా పనితీరుపై ఆ ఊరి ప్రజల ముందు రెఫరెండం పెట్టాను. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న వారి కోరికను నెరవేర్చుతూ బోధనలో మార్పులు తెచ్చాం. సర్కారు బడిని బతికించాలన్న ఉద్దేశంతో 12 లఘుచిత్రాలు తీశాను.
- మా ఊరే నన్ను కథకుడిని చేసింది. ఎండిన వాగులు.. కరిగిపోయిన కొండలు.. మొరం తేలిన వాకిళ్లు.. గల్ఫ్ దేశాలకు వలసలు.. నన్ను కదిలించాయి. నా గుండెను పిండేసిన సంఘటనలు.. బాధలు.. నా మనసులోని బరువు దించుకోడానికి నేను కథలు రాశాను. అవి కథలు కాదు.. వాస్తవిక ఘటనలకు సజీవ సాక్ష్యాలు.. నేను ఇంకా రాస్తూనే ఉంటాను. నా ఈ సాహిత్య ప్రయాణంలో నా భార్య మంజుల, కూతుళ్లు సాహితి, సతి సహకారం మరువలేనిది. కథకుడిగా ఇప్పటికి 25 ఏళ్లవుతోంది. 11 కథలతో ‘విత్తనం’ అనే కథల సంపుటి రాబోతుంది.

ఆలయ అభివృద్ధికి కృషి



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

రామగుండం: శ్రీఅభయాంజనేయస్వామి తనకు కలలో కనిపించాడని, అందుకే స్వామి దర్శనం కోసం వచ్చానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం ఆయన ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అయితే, బైపాస్ వద్ద హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని, అంబేడ్కర్ కూడలి నుంచి టెంపుల్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ అమర్చాలని ఆలయ కమిటీ సభ్యులు విన్నవించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మాజీ కౌన్సిలర్ ఇస్సంపల్లి అంజులు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, సభ్యులు శివప్రసాద్, యాదగిరి, వైకుంఠం, ఎల్.రవి, పల్లెర్ల అంజయ్య, శ్రీకాంత్, ఈదునూరి ప్రసాద్, మహ్మద్, అప్పాసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేదిలేదు

పాలకుర్తి(రామగుండం): సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడితే సహించేదిలేదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. కుక్కలగూడూర్, వేంనూర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మానంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య, జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్, పాలకుర్తి మాజీ సర్పంచ్ పర్శవేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నృత్యం చేసిన ఎమ్మెల్యే

గోదావరిఖనిటౌన్: యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో నిర్వహించిన మల్లన్న పట్నాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ నృత్యం చేశారు. యాదవులు ఆయనతో కలిసి స్టెప్పులేశారు. యాదవులు పాల్గొన్నారు.

అధికంగా వసూలు చేస్తే చర్యలు

పెద్దపల్లిరూరల్: వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్లు డెలివరీ చేసే సమయంలో ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమావేశమై పలు సూచనలిచ్చారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



యాకూబ్ పాషా(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని గడిమహిల్‌కు చెందిన ఎండీ యాకూబ్‌పాషా(రాహిల్)(33) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం యాకూబ్‌పాషా స్థానికంగా సెల్ రిపేర్ సెంటర్ నడిపిస్తూ జీవిస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిని అధిగమించలేక మానసికంగా కృంగిపోయాడు. తీవ్ర మనస్తాపంతో ఈక్రమంలో ఈనెల 5న గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి చెల్లెలు నిషాత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ఉంది. ఆమె తొమ్మిది నెలల గర్భిణి అని కుటుంబ సభ్యులు తెలిపారు.

టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో నాయకులు

గోదావరిఖని: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆవిర్భావ వేడుకలను శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని యూనియన్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. యూనియన్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, వెంకటేశ్, కుశనపల్లి శంకర్, పర్లపెల్లి రవి, మల్లారెడ్డి, మల్లయ్య, తిరుపతి, సాయికృష్ణ, సురేందర్, చిలకలపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీసీ వద్ద..

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం శనివారం స్థానిక ఆర్సీసీ వద్ద నిర్వహించారు. యూనియన్ కేంద్ర కోశాధికారి వెంకటేశ్ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ జెండా ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పులిపాక శంకర్, మల్లారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనలో టీబీజీకేఎస్ ఎనలేని కృషి చేసిందన్నారు. తెలంగాణ ఇంక్రిమెంట్, సంస్థలో నూతన ఉద్యోగాలు, సొంతింటి రుణంపై వడ్డీమాఫీ, ఉచిత విద్యుత్, ఏసీ సౌకర్యం, వృత్తి పన్నురద్దు, డ్రెస్‌కోడ్ ఏర్పాటు, సకల జనుల సమ్మె కాలపు వేతనాల చెల్లింపులతోపాటు అనేక హక్కులు సాధించి పెట్టిందని ఆయన అన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

దరువేసి.. నిరసన తెలిపి..

- మూడేళ్లుగా బిల్లులు విడుదల చేయడం లేదని ఆరోపణ
- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట శ్మశానవాటిక సిబ్బంది ఆందోళన



నిరసన తెలుపుతున్న శ్మశానవాటిక సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): హిందూ శ్మశానవాటిలో శవాలను ఖననం చేసే సిబ్బంది శనివారం బల్దియా కార్యాలయం ఎదుట డప్పులు చేతపట్టి నిరసన దరువేశారు. శవాలను ఖననం చేసినందుకు బిల్లలు మంజూరు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అధికారులకు వ్య తిరేకంగా నినాదా లు చేశారు. ఆది జాంభవ డప్పు క ళాబృందం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. గతంలో ఓసారి నిరసన తె లుపగా కొంత సొ మ్ము చెల్లించిన అధి కారులు.. మూడేళ్ల బకాయిలు రూ. 40లక్షలకుపైగా ఇ వ్వాల్సి ఉందని తెలి పారు. దీనిపై అధి కారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకునానా స్పందన రాలేదని ఆవేదన చెందారు. ఈ సమయంలో బల్దియా కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై స మీక్షిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్.. వెంటనే స్పందించారు. ఆందోళనకారులతో మా ట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విడతల వారీగా బిల్లులు చెల్లించాలని అధికారులకు సూచించారు. అధికారులు సూచించిన నియమనిబంధనలు పాటించాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. ఆదిజాంభవ డప్పు కళాబృందం సభ్యులు డప్పు రమేశ్, స్వామి, మల్లయ్య, రవి, రాజు, రత్నం, శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానంపై కోర్టు స్టే

- ఆర్డీవోకు పత్రాలు అందజేత

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి ఎంపీపీపై ఈనెల 30వ తేదీన ప్రవేశ పెట్టే అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇచ్చింది. ఈమేరకు సంబంధిత పత్రాలను శనివారం ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్‌కు అందజేశారు. ఈనెల 10న జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్, మరో నలుగురు ఎంపీటీసీలతో కలిసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ పెద్దపల్లి ఆర్డీవోకు దరఖాస్తు చేశారు. ఈమేరకు ఈనెల 30న అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించేందుకు అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య ఈనెల 25వ తేదీన హైకోర్టును ఆశ్రయించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలకు కేవలం ఐదుగురే అవిశ్వాసానికి మద్దతు సంతకాలు చేశారని, నిబంధనల ప్రకారం ఆరుగురు ఎంపీటీసీలు సంతకాలు చేయాలని ఆమె కోర్టుకు విన్నవించారు. ఈమేరకు అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిలిపివేయాలని హైకోర్టు జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

- ఢిల్లీలో పొగమంచు కారణం
- సూపర్‌ఫాస్ట్ రైళ్లు 12 గంటలకు పైగా లేట్
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



రామగుండం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

రామగుండం: న్యూఢిల్లీ నుంచి చెన్నై మార్గంలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. ప్రధానంగా శనివారం రామగుండం చేరుకోవాల్సిన పలు రైళ్లు దాదాపు 12 గంటలకుపైగా ఆలస్యంతో వచ్చాయి. దీంతో ప్రయాణికుల పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. గంటల కొద్దీ నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. న్యూఢిల్లీలో దట్టమైన పొగమంచుతో రాత్రి, వేకువజామున బయలుదేరే రైళ్లు మధ్యాహ్నం వేళ బయలు దేరుతున్నాయి. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

రామగుండం చేరుకునే రైళ్ల సమయం ఇలా..

- రైలు నంబరు 12511 కొచ్చువెల్లి –రప్తిసాగర్ రామగుండం ఉదయం 9.25గంటలకు రావాల్సి ఉండగా 7.30 గంటల ఆలస్యంగా సాయంత్రం 4గంటలకు చేరుకుంది.
- రైలు నంబరు 20806 న్యూఢిల్లీ–విశాఖపట్నం ఏపీ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 3.49 గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో ఆదివారం వేకువజాము 3.31 గంటలకు రానుంది.
- రైలు నంబరు.12616 న్యూఢిల్లీ–చెన్నై జీటీ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.09గంటలకు రావాల్సి ఉండగా పది గంటల ఆలస్యంగా ఆదివారం వేకువజామున 2.10గంటలకు చేరుకుంటుంది.
- రైలు నంబరు 12626 న్యూఢిల్లీ–త్రివేండ్రం కేరళ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.59 గంటలకు రావాల్సి ఉండగా 15 గంటల ఆలస్యంతో ఆదివారం ఉదయం 7.42 గంటలకు రానుంది.
- రైలు నంబరు 12724 న్యూఢిల్లీ–హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 12.31గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో అర్ధరాత్రి ఒంటి గంటకు రానుంది.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



సంచి ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జాతీయ హరితదళం, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుస్థిర జీవనశైలి..పర్యావరణ క్లబ్ పాత్రపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణహిత సంచి లైఫ్‌ను డీఈవో ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినియోగంతో పొంచి ఉన్నముప్పుపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. రాష్ట్ర హరితదళం ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, రిసోర్స్‌పర్సన్ శివకిరణ్, మెజీషియన్ సంతోష్, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా వేతనాలివ్వాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోలిండియాలో కనీస వేతనాలు అమలు అవుతున్నా.. సింగరేణిలో అమలు కావడం లేదని విమర్శించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కె.విశ్వనాథ్, రాజేందర్, ప్రసాద్, సంపత్ తదితరులు ఉన్నారు.